కార్పొరేట్‌ను తలదన్నేలా..

- నాడు శిథిలం.. నేడు సుందరం
- సర్కారీ స్కూళ్లకు కొత్త రూపం
- విద్యా రంగంలో వినూత్న మార్పులు
- సంక్షేమ పథకాలతోతల్లిదండ్రులకు తగ్గిన చదువుల భారం
- నాణ్యమైన విద్య.. అభివృద్ధికి బాట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం సర్కార్ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. పాఠశాలలు కార్పొరేట్‌కు తలదన్నేలా మారాయి. ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ రేటును తగ్గించాలనే లక్ష్యంగా మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాలలు కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. దేశం మొత్తం ఏపీ స్కూళ్ల ప్రగతిని ప్రశంసించేలా సర్వహంగులూ సమకూరాయి. 'నో సీట్స్' అనే స్థాయికి సర్కార్ బడులు మారడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. సత్యవేడు నియోజకవర్గంలో నాడు–నేడు పథకం కింద 333 పాఠశాలలను రూ. 38.23 కోట్లతో ఆధునికీకరించారు.


వరదయ్యపాళెం హైస్కూల్‌లో డిజిటల్ బోర్డులో సాధన చేస్తున్న విద్యార్థులు

వరదయ్యపాళెం: పేదరికాన్ని జయించే ఏకైక ఆయుధం విద్య అని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. అధికారంలోకి రాగానే సంపన్నులకే కాదు రాష్ట్రంలోని పేదలందరికీ అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని సంకల్పించారు. ప్రభుత్వ విద్యా రంగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. పాఠశాలల్లో వసతులు మెరుగు పరచడమే కాకుండా అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మెనూతో కూడిన గోరుముద్ద పథకాలు ప్రవేశపెట్టారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరిగి, విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. కార్పొరేట్‌తో పోటీ పడి పరీక్షల్లో సర్కార్ పాఠశాలల విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పాఠశాలల పరిస్థితి అధ్వానంగా ఉండేది. శిథిల భవనాలు, కొరవడిన వసతులు, దుర్గంధభరితంగా మరుగుదొడ్లు దర్శనమిచ్చేవి. క్రీడా మైదానాలు


వరదయ్యపాళెం: సుందరంగా రూపుదిద్దుకున్న మత్తేరిమిట్ట ప్రాథమికోన్నత పాఠశాల

పిచ్చి మొక్కలతో దర్శనమిచ్చేవి. ఆర్థికస్తోమత సహకరించకపోయినా పేద, దిగువ మధ్య తరగతి వర్గాలు కూడా అప్పులు చేసి తమ పిల్లలను ప్రైవేటు స్కూళ్లలో చదివించేవారు.ప్రస్తుత జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సర్కార్ స్కూళ్లలో సర్వ హంగులు సమకూరడంతోపాటు, ఇంగ్లిషు మీడియం, స్మార్ట్ తరగతులు, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణ తదితరాలతో ఏటా అడ్మిషన్ల సంఖ్య పెరుగుతోంది.

నాడు నేడు కింద మౌలిక వసతులు ఇవి..

- టాయిలెట్ల నిర్మాణం
- ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ
- తాగునీటి సరఫరా
- విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్
- పాఠశాలకు పెయింటింగ్
- స్కూళ్లకు పెద్ద, చిన్న మరమ్మతులు
- ఆకుపచ్చ సుద్ద బోర్డులు
- ఇంగ్లిష్ ల్యాబ్స్
- ప్రహరీ గోడల నిర్మాణం

సత్యవేడు నియోజకవర్గంలో నాడు–నేడు కింద ఆధునికీకరించిన పాఠశాలలు

మొత్తం పాఠశాలలు :	388
ఆధునికీకరించిన పాఠశాలలు :	333
ఖర్చు చేసిన నిధులు (కోట్లలో) :	రూ. 38.23
పాఠశాలలో ఉపాధ్యాయులు :	1260
విద్యార్థుల సంఖ్య :	30500
2018-19లో విద్యార్థుల సంఖ్య :	29100
పెరిగిన విద్యార్థుల సంఖ్య :	1400



నెల్లటూరు పాఠశాల ఆర్చీ, ప్రహరీ


వరదయ్యపాళెం హైస్కూల్‌లో అధునాతన డెస్కుల్లో విద్యార్థులు


బీఎన్‌కండ్రిగ హైస్కూల్‌లో మరుగుదొడ్లు


బీఎన్‌కండ్రిగలో మినరల్ వాటర్ సిస్టమ్

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన పథకానికి శనివారం రూ.30వేలు విరాళం అందింది. పట్టణంలోని కొండమిట్టకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు పసుపులేటి ధనలక్ష్మి ఈ మేరకు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులుకు విరాళాన్ని అందజేశారు.

టైలర్స్ అసోసియేషన్ వార్షికోత్సవానికి ఆహ్వానం


ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలో ఈనెల 28వ తేదీ టైలర్స్ డే సందర్భంగా నిర్వహించనున్న శ్రీకాళహస్తి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 31వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. తప్పక హాజరవుతానంటూ వారికి ఎమ్మెల్యే మాటిచ్చారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు అందించిన వివరాలు..శ్రీకాళహస్తికి చెందిన కుమారస్వామి(35), వినీత్(27) ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతున్నారు. అంజిమేడు వద్ద ముందు వెళుతున్న కారును అధికమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలి

సత్యవేడు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదవీ విరమణ పొందిన వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.చెంచులయ్య కోరారు. ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు శనివారం ఆర్టీసీ గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ12వ పీఆర్‌సీలో మధ్యంతర భృతి(ఐఆర్)30 శాతం చెల్లించాలని కోరారు. గ్యారేజ్ సెక్రటరీ శేఖర్, డిపో సెక్రటరీ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పేటలో గడప గడపకు..

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఆదివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ గిడ్డయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

వంట పాత్రల వితరణ


వంటపాత్రలు అందజేస్తున్న కార్తీక్‌సాయి

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేటకు చెందిన మురళీకుమార్, రుక్మిణి దంపతుల కుమారుడు, పూర్వ విద్యార్థి కార్తీక్‌సాయి వంట పాత్రలను పాఠశాలకు వితరణగా అందజేశారు. చెన్నైలో స్థిరపడిన ఆయన శనివారం స్వగ్రామానికి వచ్చి పాఠశాల హెచ్‌ఎం కోటీశ్వరంను కలిసి గ్యాస్ స్టౌ, నీటి డ్రమ్ము, ప్లేట్లు, బిందెలు అందజేశారు. అంగన్‌వాడీ పిల్లలకు అవసరమై వస్తువులు అందజేస్తానని ఆయన తెలిపారు. సర్పంచ్ టి.జయ, ఎంపీటీసీ సభ్యుడు మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



ఏర్పేడు: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేశవులు అన్నారు. శనివారం మండలంలోని సరస్వతికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి చాన్‌బాషా, హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో 3 దశాబ్దాల అభివృద్ధి


చేమూరులో కరపత్రాలు అందిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని నాలుగున్నర ఏళ్లలో చేసి చూపించినట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి తెలిపారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా శనివారం తొట్టంబేడు మండలం చేమూరులో శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి మధుసూదన్‌రెడ్డి శ్రీకాళహస్తిలోనే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం జగనన్న ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో 30 ఏళ్లలో జరగని అభివృద్ధి మధుసూదన్‌రెడ్డి చేసి చూపించారని తెలిపారు. కరోనా సమయంలో ప్రజల మధ్యనే ఉంటూ సొంత నిధులు వెచ్చించి సాయం అందించారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చి ఓట్లడిగేవారిని నమ్మవద్దన్నారు. ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీటీసీ సభ్యుడు వేమాలయ్య, నాయకులు గురవారెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గెరటారెడ్డి, ఢిల్లీబాబురెడ్డి, చలపతి, మణినాయుడు, చంద్రయ్యనాయుడు, రఘురాం, అలంకారయ్య, మునికృష్ణ, పెంచలయ్య పాల్గొన్నారు.

శనేశ్వరస్వామికి విశేష పూజలు


విశేష అలంకరణలో స్వామివారు


అభిషేకం చేస్తున్న అర్చకస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీశనేశ్వర స్వామి సన్నిధిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తైలాభిషేకం, జలాభిషేకం చేసి, ధూప దీప నైవేద్యాలు, పంచ హారతులు సమర్పించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్చిలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను దేవస్థానం ఈవో నాగేశ్వర్‌రావు శనివారం పరిశీలించారు. దర్శనానికి వచ్చే అశేష భక్తులను దృష్టిలో ఉంచుకుని క్యూల ఏర్పాటుపై ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ధూర్జటి కళాప్రాంగణం ప్రాంతం, పార్కింగ్ తదితర ప్రాంతాలను ఈవో పరిశీలించి ఆలయ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం


పెనుబాకలో ప్రచారం చేస్తున్న బియ్యపు పవిత్రా రెడ్డి

శ్రీకాళహస్తి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పలు పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెనుబాక, శెనగలమిట్ట గ్రామాల్లో శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వంతో జరిగిన మేలును వివరించారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకే పథకాల లబ్ధిని వారి ఖాతాలకే జమ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉంటే పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. ఇలాంటి ప్రభుత్వం ఇలాగే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భానుయాదవ్, సర్పంచ్ రజనీ, మనోహర్, ఎంపీటీసీ సభ్యులు ప్రభాకర్, రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ మధురెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మునిరత్నం, నాయకులు సుబ్బారావు, రామ్మూర్తి, రమేష్ నాయుడు, ఆనంద్, దేవ, బాల, పుల్లయ్య, ప్రకాష్, నరేంద్రనాయుడు, జయచంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు ప్రతిరూపం వలంటీర్లు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: వలంటీర్లు సేవలకు ప్రతిరూపాలని, నిజాయితీ, నిబద్ధతే గ్రామ వలంటీర్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని ఎంపీడీఓ సాలెట్ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లుకు సేవామిత్ర, సేవారత్నా పురస్కారాలను అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో 197 మంది వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారన్నారు. వీరిలో 192 మంది సేవా మిత్ర పురస్కారానికి ఎంపిక కాగా, ఐదుగురు సేవా రత్నాకు ఎంపికైయ్యారని తెలిపారు. గ్రామ వలంటీర్లను మరింత ప్రోత్సహించేందుకు ఏటా ఇస్తున్న గౌరవ పురస్కారాల మొత్తాన్ని 50 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి, సర్పంచ్‌లు జనార్దన్, వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, ఏఓ త్రివిక్రమ్‌రావు, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పనుల పరిశీలన


క్రీడా మైదానం పనులను పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పీఎంశ్రీ పనులను శనివారం జిల్లా విద్యాశాఖ సమన్వయ కర్త శ్రీధర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ సారథి పరిశీ లించారు. వారు మాట్లాడుతూ పీఎంశ్రీ పథకంలో జిల్లా 23 పాఠశాలలు ఎంపిక కాగా, అందులో ఈ పాఠశాల ఒకటి అని తెలిపారు. మొదటి విడతలో పీఎంశ్రీ పథకంలో రూ. లక్ష నిధులతో క్రీడా మైదానం మరమ్మతు పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి, బడికి సక్రమంగా రాని వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, బడికి వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ మునిసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రానందం.. లక్ష్మీనరసింహ కల్యాణం


స్వామి వారి కల్యాణం చేస్తున్న వేదపండితులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి, ఆది లక్ష్మీదేవి, చెంచు లక్ష్మీదేవి కల్యాణాన్ని అర్చకులు, వేదపండితులు నేత్రానందకరంగా జరిపించారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుపతి(అలిపిరి): తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కాకుండా నేరుగా దర్శనం కల్పిస్తున్నారు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా రాత్రి వరకు 77,483 మంది స్వామివారిని దర్శించుకోగా 19,276 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు డైరెక్టు లైన్ ద్వారా 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నాలెడ్జ్ హబ్‌గా డేటా సైన్స్ సెంటర్

తిరుపతి సిటీ: సాంఖ్యక శాస్త్ర విద్యార్థులకు డేటా సైన్స్ సెంటర్ నాలెడ్జ్ హబ్‌గా ఉపయోగ పడుతుందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం పద్మావతి మహిళావర్సిటీ, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ (ఐఎస్‌పీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలో డేటా సైన్స్‌లో స్టోకాస్టిక్ మోడల్స్ అనే అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. మెషిన్ లెర్నింగ్‌లో ఎదురయ్యే సమస్యలను పరిష్కారించగల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంఖ్యక శాస్త్ర నిపుణుల్లో ఉంటుందన్నారు. డేటా సైంటిస్టులు వ్యవస్థాపకులుగా మారే అవకాశాలు డేటా సైన్స్‌తోనే సాధ్యమన్నారు. యువత దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఐఎస్‌పీఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్ డేటా సైన్స్‌దేనని, సాంఖ్యక శాస్త్రంపై యువత దృష్టి సారించాలని సూచించారు. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో డేటా సైన్స్ సెంటర్‌ను ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి నెలకొల్పినట్లు తెలిపారు. సెక్రెటరీ, చీఫ్ స్టాటిస్టిషియన్ ఆఫ్ ఇండియా డాక్టర్ జీపీ సమంత చేతుల మీదుగా డేటా సైన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంఖ్యక శాస్త్ర పితామహుడు డాక్టర్ ఫిషర్ చిత్రపటానికి ముఖ్యఅతిథులు నివాళులర్పించారు.

సనాతన ధర్మానికి వేదాలే మూలం


ప్రసంగిస్తున్న వేదిక్ వీసీ రాణి సదాశివమూర్తి

తిరుపతి సిటీ: భారతీయ సనాతన ధర్మానికి వేదాలే మూలమని వాటిలోని జ్ఞానాన్ని తెలుసుకోవాలని వేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి పిలుపునిచ్చారు. శనివారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వేదభాష్య విభాగం ఆధ్వర్యంలో జరిగిన భారతీయ జ్ఞానపరంపరలో శిక్షాగ్రంథాల గొప్పతనం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భారతీయ జ్ఞాన పరంపర అనేది దేశానికి ఉన్న అపార సంపద అన్నారు. మన రుషులు భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లోని పలు విషయాలను దూరదృష్టితో వేల సంవత్సరాల ముందే వేదాలు, శాస్త్రాలలో వివరించారని తెలియజేశారు. ఎస్వీయూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, మహామహోపాధ్యాయ సత్యవాగీశ్వర ఘనపాఠి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.